నమ్మకమైన మేనిఫెస్టోతో మరింత మేలు

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోపై భీమిలి నియోజకవర్గ ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేశారని... సీఎం జగన్ ఎప్పుడూ చేయగలిగేవే చెబుతారని... చెప్పారంటే చేస్తారని కొనియాడుతున్నారు. గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ కొనసాగించడంతోపాటు అమ్మఒడి రూ.17 వేలకు, రైతు భరోసా రూ.16 వేలకు, పింఛన్ రూ.3,500కు పెంచడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతా సీఎం జగన్ పాలనలో సామాజిక న్యాయం సాకారమైందని... మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అయితే మరింత మేలు జరుగుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారు. – తగరపువలస

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాకారమైంది. మాటల్లో కాకుండా 50 శాతం రిజర్వేషన్‌తో నామినేటెడ్ పదవులు ఇచ్చి చూపించారు. గతంలో చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారు. 2014లో చంద్రబాబును నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేస్తే ఈ 58 నెలల్లో అర్హులను వెతికి మరీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందించి నిజమైన హీరో అనిపించుకున్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్, చంద్రబాబు పాలనలో తేడా స్పష్టంగా కనిపించింది. మరోమారు చంద్రబాబును నమ్మి మోసపోరు.

– డబ్బీరు ప్రశాంతి, రాష్ట్ర శిష్టకరణాల మహిళా అధ్యక్షురాలు, తగరపువలస

జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు



చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రంలో అతిస్వల్పంగా ఉన్న ఒక వర్గానికే మేలు జరుగుతుందని స్పష్టమైంది. అంతేకాకుండా రాజధానిని అమరావతికి తీసుకుపోయే ప్రమాదం ఉంది. అదే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితే అన్నివర్గాలకు అందిస్తామన్న సంక్షేమాన్ని గత మేనిఫెస్టోలో ప్రకటించి అదే పూర్తి చేశారు. ఇప్పుడు కూడా అదే ధైర్యంతో మరోమారు రాష్ట్ర ప్రజల సంక్షేమ మేనిఫెస్టో ప్రకటించి ప్రజాతీర్పు కోరుతున్నారు. జగన్ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరిగి తీరుతుంది. దేశంలోనే ఎవరూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు అందించి నంబర్ వన్ స్థానంలో ఉన్నారు. ప్రజల తీర్పు వైఎస్ జగన్‌కే అనుకూలమవుతుంది.

– జీరు వెంకటరెడ్డి, జీరుపేట

బాబుతో పోలిస్తే సీఎం జగన్ ఎంతో మేలు



చంద్రబాబు సంపద సృష్టిస్తానంటూ తరచూ అబద్ధపు మాటలు వినిపిస్తాడు. 2014 – 19 మధ్య చంద్రబాబు పాలనలో 21.8 శాతం అప్పులు పెరిగిపోగా సీఎం జగన్ పాలనలో కేవలం 12.3 శాతమే పెరిగాయి. చంద్రబాబు హయాంలో 4.47 శాతం జీఎస్‌డీపీ ఉంటే.. కరోనా రెండేళ్లు ఇబ్బంది పెట్టినా సీఎం జగన్ పాలనలో జీఎస్‌డీపీ 4.83 శాతం నమోదయింది. పాలనకు చంద్రబాబులా వయసు, అనుభవం ఉంటే సరిపోదు... జగన్‌లా ప్రజలకు మేలు చేయాలన్న తపన ఉండాలి. – చిల్ల బాబయ్యరెడ్డి, సీనియర్ సిటిజన్, చిల్లపేట

సీఎం జగన్‌ను ప్రజలు నమ్మారు



గతంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. సంక్షేమం అంటే ఇదీ అని నవరత్నాలతో పాటు అందులో లేని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సీఎం జగన్ ప్రజల విశ్వాసాన్ని పొందారు. ఈ రోజు మేనిఫెస్టోలో కూడా సంక్షేమాన్ని కొనసాగిస్తూ ప్రజల ముందుకు వచ్చారు. చంద్రబాబు పెత్తందారులకు ప్రతినిధి అయితే సీఎం జగన్ పేదల ప్రతినిధి. మరోమారు జగన్‌కే అవకాశం ఇస్తారు. ఈ విషయం తెలిసే ఎల్లో మీడియా, చంద్రబాబు, పవన్‌లు జగన్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు.

– చేట్ల ఎల్లయ్యరెడ్డి, మాజీ కౌన్సిలర్, చిట్టివలస

పింఛన్ పెంపు సంతోషకరం



తాము గత ఐదేళ్లు ఇంటి నుంచి బయటకు రాకుండా ప్రతీ నెల ఒకటో తేదీన ఇంటి వద్దకు వచ్చి పింఛన్ల నగదు అందించే విధానాన్ని అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం. ఇప్పుడు దానికి మరో రూ.500 కలిపి ఇవ్వాలని నిర్ణయించడం మరింత ఆనందంగా ఉంది. జగన్ బాబులా పింఛన్లు ఎవరూ పంపిణీ చేయలేరు.

– సూద సత్యవతి, స్థానికురాలు, భీమిలి

ఉన్నత స్థితికి విద్యావ్యవస్థ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరూ ఊహించని విధంగా 'నాడు – నేడు' ద్వారా పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మారిపోవడంతోపాటు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన ద్వారా ఎంతో మంచి జరిగింది. ఇప్పుడు అమ్మ ఒడి రూ.17 వేలకు పెంచడంతో మరింత మేలు జరుగుతుందని ఆశపడుతున్నాం.

– పి.రిషిత ప్రియాంక, విద్యార్థిని, భీమిలి

అక్కచెల్లెళ్లకు ఎంతో మేలు



సీఎం జగన్ మోహన్ రెడ్డి మహిళలకు ఆర్థికంగా భరోసా ఇవ్వడంతోపాటు రాజకీయంగా ప్రోత్సహించారు. మహిళలకు మంత్రి పదవులు ఇవ్వడంతోపాటు దేశంలో తొలిసారిగా నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ పనుల్లో 50 శాతం కేటాయించేలా చట్టం చేశారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితే ఇలాంటివి అన్నీ కొనసాగుతాయన్న నమ్మకం వుంది. అంతకంటే ఏం కావాలి. మహిళలకే కాదు అన్ని వర్గాల వారికి మేలు చేసే ఎన్నో అంశాలు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో ప్రకటించారు. ఇది ప్రత్యర్థులకు దడ పుట్టిస్తోంది. – పోతిన సత్య, మధురవాడ

చాలా సంతోషంగా ఉంది



పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.3,500కు పెంచడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే నెలకు రూ.3 వేలు ఇంటి వద్దే అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్థికంగా మాకు చేయూత అందిస్తున్నారు. మరలా ముఖ్యమంత్రి అయితే మాలాంటి వారికి ఎంతో లాభదాయకంగా ఉంటుంది. జగన్ చెప్పాడంటే తప్పకుండా అమలు చేస్తాడు. ఆ నమ్మకం మాకు ఉంది.

– సీరపు పద్మావతి, సాగర్‌నగర్.

జగన్‌కు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత ద్వారా ఇప్పటికే ఎంతో ఆర్థిక బలాన్ని చేకూర్చారు. ఇప్పుడు మరలా ముఖ్యమంత్రి అయితే వైఎస్సార్ చేయూత ద్వారా మరింత మేలు చేస్తామని చెప్పారు. ఇది నిజంగా మహిళలకు వరమే. ఇంట్లో ఉంటూ నేడు గౌరవంగా బతుకుతున్నామంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దయ వలనే. అందరూ జగనన్నకు రుణపడి ఉంటారు. – బి.విజయకుమారి, ఎండాడ.

క్లుప్తంగా

బొత్స ఝాన్సీకి పాస్టర్ ఫెలోషిప్ మద్దతు



బొత్స ఝాన్సీని కలిసి మద్దతు తెలుపుతున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్ ఫెలోషిప్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం విశాఖలో ఆమెను కలిసి విజయానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. క్రైస్తవ సంఘాల తరఫున కన్వీనర్ బొడవరపు కరుణా సాగర్, ఇతర జిల్లా పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు, సంస్థల ప్రతినిధులు పాస్టర్ ప్రభుదాస్, దానియేల్, పాల్ రాజ్, జయరాజ్ తదితరులు ఆమెను కలిసిన వారిలో ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కొమ్మాది: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జాయింట్ సీపీ ఫకీరప్ప అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో గల జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, సీసీ కెమెరాలు, వాటి పనితీరు తనిఖీ చేశారు. పోలింగ్ సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు



టీడీపీ నాయకులపై ఆర్వో భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న లీగల్ సెల్ అడ్వకేట్స్

కొమ్మాది: టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో అనేక చోట్ల ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆర్వో భాస్కర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అడ్వకేట్స్ ఎన్.సంతోష్‌కుమార్, ఇ.గిల్‌బర్ట్ శనివారం ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో శుక్రవారం టీడీపీ నాయకుల ఎన్నికల ప్రచారం అనంతరం డబ్బు పంపిణీ, శనివారం 6వ వార్డు కొమ్మాది త్రిశక్తి ఆలయంలో టీడీపీ కండువా వేసుకుని గంటా రవితేజ కోలాటం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని భాస్కర్‌రెడ్డిని వీరు కోరారు.

చంద్రంపాలెంలో చలివేంద్రం ఏర్పాటు



చంద్రంపాలెంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు, కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డీ సాయినాథ సహిత దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో పీఎం పాలెం పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పీఎం పాలెంకి చెందిన ఉద్దండు కృష్ణారావు కుమారులు వరహాలురావు సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యులు పీకేఎం పాత్రుడు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు కేవీ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పొన్నగంటి నాగేశ్వరరావు, కె.శ్రీరాములు, యస్.గణేష్ తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, పిళ్లా రాము, పోతిన పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం



జనం మధ్య వెలిగించిన బాణసంచా

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్ ప్రాంతాల్లో శనివారం జరిగిన టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రచారం జరుగుతుండగానే జనం మధ్య బాణసంచా వెలిగించడంతో అక్కడకు వచ్చిన ప్రజలు, చుట్టుపక్కల వ్యాపారులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. జనం మధ్య ఇలాంటి పనులు చేయడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో అందరికీ లబ్ధి

- అన్నివర్గాలకూ లబ్ధి చేకూర్చడమే సీఎం జగన్ లక్ష్యం
- అమలు చేయగలిగినవి చెప్పడమే ఆయన నైజం
- చంద్రబాబు హామీలు ప్రజలు నమ్మడం లేదు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయం వద్ద మండల, జోనల్ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలోని అన్ని హామీలను ఖచ్చితంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ పథకాలు అందించామని, గత ఐదేళ్లు నిజాయితీగా పాలన సాగిందన్నారు. ఏమి చేయగలమో దాన్నే సీఎం జగన్ చెప్పారని, ఇది ఆయన గొప్పదనమని కొనియాడారు. ఏమాత్రం అమలు చేయలేని హామీలను చంద్రబాబు ఇస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో ప్రజలకు జరిగే మేలును ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. ప్రజలు ఇప్పటికే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని నిర్ణయించుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు పొందిన విశ్వాసం వారిలో ఉందని, ఖచ్చితంగా వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు జన్మ హక్కు అని... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం సీఎం జగన్ నైజమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, దాట్ల పెదబాబు, జీవీఎంసీ 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆర్భాటం బారెడు.. ప్రచారం మూరెడు

- 'గంటా' ప్రచారానికి కలిసిరాని కార్యకర్తలు, నాయకులు
- 2014 – 2019లో హామీలు నెరవేర్చలేదని మండిపాటు
- డబ్బులిచ్చినా ప్రచారానికి జనం కరువు
- తీవ్ర నిరాశ, నిస్పృహలో టీడీపీ శ్రేణులు

తగరపువలస : భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలో ఆర్భాటమే తప్ప జనం, కార్యకర్తలు కలిసి రావడం లేదు. 2014 – 2019 మధ్య ఈ నియోజకవర్గం తరఫున ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసినా భీమిలి ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చలేకపోవడం, ఇక్కడి ప్రజలకు అందుబాటులో లేకపోవడంతోపాటు, అతని అనుచరులు విపరీతంగా భూకబ్జాలకు పాల్పడడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో వున్నారు. గంటా బాధితులు భీమిలి నియోజకవర్గం నలుమూలలా ఇప్పటికీ బాధ పడుతూనే ఉన్నారు. మరోమారు గంటాకు అవకాశమిస్తే భస్మాసురుని హస్తం నెత్తిన పెట్టుకున్నట్టేనని ఆ ఐదేళ్ల కాలాన్ని తలచుకుని వణికిపోతున్నారు. గంటా, అతని అనుచరులు పాల్పడిన కబ్జాలకుగాను సహాయపడిన అప్పటి భీమిలి, విశాఖ రూరల్ మండలాల తహసీల్దార్లు బీటీవీ రామారావు, మజ్జి శంకరరావు తగిన మూల్యం చెల్లించుకున్న విషయాన్ని ఇప్పటికీ భీమిలిలోని పలు విభాగాల అధికారులు పీడకలగా గుర్తు పెట్టుకున్నారు.

బలవంతంగా పచ్చ కండువాలు వేసినా...

2014 – 2019 మధ్య టీడీపీ పాలనలో భీమిలి నియోజకవర్గంలో జరిగిన అరాచకాలు, భూకబ్జాలను ప్రజలు మరిచిపోకపోయినా... గంటా మరచిపోయినట్టున్నాడు. అందుకే ప్రస్తుత ప్రచారంలో మసిపూసి మారేడుకాయ చేసినట్టుగా ఆర్భాటంగా ప్రచారం నిర్వహించాలనుకుంటున్నాడు. గంట పాటు ప్రచారంలో పాల్గొంటే రూ.వంద వంతున లెక్కలు కట్టి ఇద్దామనుకున్నా జనం ఆ వైపే చూడాలనుకోవడం లేదు. వచ్చిన వారికి బలవంతంగా పచ్చ కండువాలు వేసి శునకానందం పొందాలనుకుంటున్నారు. శుక్రవారం నాటి తిమ్మాపురం ప్రచారంలో సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన 'ది విశాఖపట్నం డ్రై ఫిష్ వుమెన్ కో ఆపరేటివ్ సొసైటీ' గౌరవ అధ్యక్షుడు మారుపల్లి అమర్‌నాథ్‌కు గంటా పచ్చ కండువా వేయబోగా తిరస్కరించారు. తాను సమస్యలు చెప్పుకోవడానికి వచ్చానని, కండువాలు వేసుకోనని కుండబద్దలు కొట్టేశారు. దీంతో తన అనుచరుల సమక్షంలో గంటా అభాసుపాలయ్యాడు.

రోడ్డు షోలతో సరి.. ఇంటింటా ప్రచారం నిల్

అట్టహాసంగా ప్రచారం చేద్దామనుకుని ఒకటి, రెండుసార్లు ప్రయత్నించినా తన పాచికలు పారకపోవడంతో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు రోడ్డు షోలకే పరిమితమయ్యారు. బలప్రదర్శన పేరుతో జరిపిన నామినేషన్ కార్యక్రమం తుస్సుమంది. నామినేషన్‌కు వచ్చేవారికి టీడీపీ, జనసేన నాయకులు డబ్బులు ఇవ్వకుండా మడత పెట్టేయడంతో వారు ఇప్పటికే ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మరోవైపు గంటా రూ.లక్షలు కుమ్మరించి కొనుగోలు చేసుకున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు గ్రామాల్లో ముఖం చెల్లక ఇళ్లకే పరిమితమైపోయారు. పదవులు ఇచ్చి గౌరవం ఇచ్చిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచామన్న భావన వలన ప్రజాప్రతినిధులను మానసికంగా కుంగదీస్తుండగా స్థానిక ప్రజల నుంచి వారికి రోజూ ఛీదరింపులే ఎదురవుతున్నాయి. వార్డు, గ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు గంటా ఇచ్చే డబ్బుల కోసం ఎదురు చూస్తూ ఇంటింటా ప్రచారానికి ఎగనామం పెట్టేశారు. ఐదేళ్లు డబ్బులకు ముఖం వాచిపోయినట్టు ఎదురు చూస్తున్న టీడీపీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో గంటా ఇచ్చే కాస్తో, కూస్తో నాలుగు రాళ్లు వెనకేసుకోవడానికి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఓటర్లకు డబ్బులు పంచే బాధ్యత తమ చేతుల మీద జరిగితే చాలన్నట్టు ఎదురు చూస్తున్నారు. టీడీపీ నుంచి ఇంటింటా ప్రచారం జరగకపోవడంతో అసలు భీమిలిలో ఆ పార్టీ పోటీలో ఉందా..? అనే అనుమానం నియోజకవర్గం నలుమూలల నుంచి ఓటర్లు వ్యక్తం చేస్తున్నారు. ఏదో జరిగిపోతుందని ఊహించుకున్న టీడీపీ శ్రేణులు తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయాయి.

అందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నార్త్ ఏసీపీ సునీల్

పద్మనాభం: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని నార్త్ ఏసీపీ బి.సునీల్ అన్నారు. మండలంలోని బి.తాళ్లవలస, కోరాడ పంచాయతీ గెద్దపేట గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రజలను ఘర్షణలకు ఉసిగొల్పకూడదన్నారు. ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ ఆఫీసర్ బి.శైలజ, సీఐ సీహెచ్.శ్రీధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, బి.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

భీమునిపట్నం: భీమిలి పరిధిలో శనివారం పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇక్కడి మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల, సెడార్ పాఠశాల కేంద్రాలుగా కేటాయించారు. ఇందులో బాలలు 601 మంది, బాలికలు 442 మంది కలిసి మొత్తం 1043 మంది పరీక్ష రాయాల్సి వుండగా బాలురు 553 మంది, బాలికలు 398 మంది కలిపి 951 మంది (91 శాతం) పరీక్షకు హాజరయ్యారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేయడంతో ఇబ్బందులు ఎదురుకాలేదు.

ప్రబోధానందుని బోధనలు అనుసరణీయం



త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీత రచయిత ఆచార్య ప్రబోధానందుని బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలిలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన ఆధ్యాత్మిక బోధనలు మానవాళికి మేలు చేసేవన్నారు. కార్యక్రమంలో ప్రబోధానందుని శిష్యుడు బోని రావణ అక్షయ్, వైఎస్సార్‌సీపీ రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు శిరిగుడి ఈశ్వరరావు, దుంపల నాగమణి, కొయ్య శ్రీనివాసరెడ్డి, చిల్ల కృష్ణ, ఉండబట్ల చిన్నారావు, కొయ్య రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వలస పక్షులను తరిమికొట్టండి



జీవీఎంసీ 7వ వార్డు ఏఎస్‌ఆర్ నగర్‌లో కరపత్రం అందజేస్తున్న పోతిన శ్రీనివాసరావు, నాయకులు



గంధవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాందేవుపురంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు

మధురవాడ: ఎన్నికల కోసం వచ్చే రాజకీయ వలస పక్షులను తరిమికొట్టాలని ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్, గణేష్‌నగర్, అల్లూరి సీతారామరాజు నగర్ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం సాయంత్రం విస్తృతంగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలపై అనేక విమర్శలు చేసి, వాటి అమలును అడ్డుకునేందుకు కుట్రలు పన్నిన నాయకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు, వంకాయల మారుతీ ప్రసాద్, పిళ్లా కృష్ణమమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, పెంద్ర అప్పన్న, నంబర్ రమణమ్మ, తమ్మినేని వరలక్ష్మి, పసుపులేటి గోపి, పీవీజీ అప్పారావు, డాక్టర్ సూర్యనారాయణ, పోతిన జోగిబాబు, కె.శ్రీదేవి, పి.రాజు, పద్మ, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఇంటింటికీ ప్రచారం

పద్మనాభం : మండలంలోని రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం రాత్రి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. గంధవరంలో సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు, బాందేవుపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాజిగాని పైడినాయుడు, సుంకర పైడినాయుడు, పొట్నూరు అబద్ధం, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని, భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు.

ఒకటి నుంచి వేసవి శిబిరం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ ఆలయంలో మే 1 నుంచి 8 వరకు విద్యార్థుల కోసం వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో తెలిపారు. యోగా, ప్రార్థనలు, ధ్యానం, సంగీతం, భగవద్గీత విలువలు, నృత్యం, తత్వశాస్త్రం, క్రాఫ్ట్, కళలు, ఎరోబిక్స్, పూజ, సంస్కృతం, పెయింటింగ్, శ్లోకపఠనం, డ్రామా, మహాభారతం, రామాయణం వంటి గ్రంథాల నుంచి కథలు చెప్పడం, పలు ఆటలు, కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. 12 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9441792704, 9849180900ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ హామీలు ప్రజలు నమ్మడం లేదు



లక్ష్మీవానిపాలెంలో ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన టీడీపీ నాయకులు, చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మడం లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా సంక్షేమమే అజెండాగా ఐదేళ్లు నిజాయతీతో పాలించిన సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారన్నారు.

జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో గల జీవీఎంసీ ఆరో వార్డులో అభివృద్ధి వైఎస్సార్‌సీపీ పాలనలోనే జరిగిందన్నారు. వార్డులో సుందరమైన పార్కులు నిర్మించామని, పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం చేరువ చేసేందుకు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనతో గత టీడీపీ పాలనకు పోలికే లేదన్నారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, గత ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక, స్థానిక నాయకులు పోతిన ప్రసాద్, ఎల్లాజీ, పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, సియ్యాద్రి కనకరాజు, జామి శివకుమార్, గాయత్రినగర్ అప్పారావు, ఎం.ఈశ్వరరావు, పోతిన సూరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.